

# వల

'సిరా'

పద్నాలుగు అంతస్తులతో ఆ మహా నగరంలో నుండి ఎత్తుగా కనిపిస్తోంది రైల్ హౌస్. అక్కడి నుండి ఆ జోన్‌కు సంబంధించిన అన్ని కేంద్రాలకూ రోజు వారీ నిర్ణయాలు, అధికారుల కార్యక్రమాలు తెలియ పరుస్తూ ఉంటారు. ట్రాకు పనులు, రైలు వంతెనలు నిర్మించడం, ఉద్యోగుల నియామకాలు, మార్పులు, ఒకటేమిటి, అన్ని రకాల కీలకమైన శాఖ లుండే భవనం అది. అన్ని అంతస్తుల కన్నా పైన ఉండే అంతస్తులో ఆ రైల్వేకు సంబంధించిన జనరల్ మేనేజరు ఉంటాడు. కాబట్టి ఆ పెద్ద భవనాన్ని జీఎమ్స ఆఫీసని పిలుస్తారు ఉద్యోగు లంతా. ఆ జీఎమ్స ఆఫీసు కింది అంతస్తులో అవినీతి నిరోధక శాఖ అధికారి చీఫ్ విజిలెన్స్ ఆఫీసరు ఉంటాడు.

రైల్వేలో కింది స్థాయి అంటే ఆఫీసరు గ్రేడు కంటే కింది స్థాయి ఉద్యోగులలో జరిగే అవినీతిని అరి కట్టే ఉద్దేశ్యంతో ఈ విజిలెన్స్ శాఖ ఏర్పడింది. ఈశాఖకు రైల్వేలో ఉండే వివిధ శాఖల ఉద్యోగులను డెప్యుటేషను పద్ధతిపై ఎంపిక చేస్తారు. అలా ఎంపికైన అధికారే విజిలెన్సు ఇన్స్‌పెక్టరు ఏకాంబరం. చీఫ్ కబురు చేస్తే, చాంబరు వద్ద ఆదుర్దాగా ఎదురు చూస్తున్నాడు.

"సార్, లోపలకు పదండి" అని ప్యూన్‌చెప్పగానే డ్రెస్ సర్దుకుని చీఫ్ విజిలెన్స్ ఆఫీసరు చాంబర్సులో ప్రవేశించాడు ఏకాంబరం.

"కమాన్ మిస్టర్ ఏకాంబరం! ప్లీజ్ టేక్ యువర్ సీట్" అంటూఆహ్వానించాడు విజిలెన్స్ చీఫ్ దినకర్ పాండే.

"థాంక్యూ సార్" అంటూ కుర్చీలో కూర్చుని ప్రశ్నార్థకంగా మొహం పెట్టి ఆయన వైపు చూశాడు.

"చూడండి. మీ ఇయర్ ఎండింగ్ టార్గెట్స్ ఆల్ మోస్ట్ ఆల్ పూర్తి చేశారు. కానీ, కొన్ని సర్‌ప్రైజు చెక్కులు పూర్తి చేయాలి. వాటిలో డెకాయ్ చెక్సు కూడా ఉన్నాయి కాబట్టి వెంటనే పూర్తి చేయండి" అంటూ ఆజ్ఞాపించి, "మీరు చీఫ్ విజిలెన్స్ ఇన్స్‌పెక్టరుగా ఆల్మోస్టాల్ క్వాలిఫై అయ్యారు. ఈ చెక్స్ పూర్తవగానే మీకు ఆర్డర్సు ఇష్యూ చేస్తాను. ఎనీ హౌ, కంగ్రాచులేషన్స్ ఇనెడ్వాన్స్" అంటూ

ముగించాడు సీ. వీ. ఓ. దినకర్ పాండే.

"థాంక్యూ సార్. చెక్స్ పూర్తి చేసి మిమ్మల్ని కలుస్తాను" అంటూ సెలవు తీసుకుని బయటకు వచ్చాడు ఏకాంబరం ఉప్పొంగి పోతూ.

రైల్వే ఎకౌంట్స్ బ్రాంచిలో గుమాస్తాగా జీవితాన్ని ప్రారంభించిన ఏకాంబరానికి మొదటి నుండి తను చేసే జాబ్ అంటే ఎంతో నిరుత్సాహంగా, నీరసంగా ఉండేది. యాంత్రికమైన, ఏమీ గుర్తింపు లేని గుమాస్తా ఉద్యోగం అది. అవసర స్నేహాలు, వ్యాపార సంబంధాలతో ముడి పడి ఉన్న ఈ సమాజం అంటే ఏకాంబరానికి ఏవగింపుగా ఉండేది. అతనికి అందరూ లోబడి ఉండాలని, అతనంటే అందరూ హడలి చావాలని ఉండేది. రైల్వే డిపార్టుమెంటులో ధనాన్ని కొల్ల గొట్టే అధికారులను మిగిలిన ఉద్యోగస్తులను ఉరి కంబం ఎక్కించాలని, అవకాశం దొరికినప్పుడల్లా ఉపన్యాసాలు ఇస్తుండే వాడు. తదనుగుణంగానే విజిలెన్స్ డిపార్టు మెంటులో పరీక్షలు రాసి విజిలెన్స్ ఇన్స్పెక్టరుగా ఎంపికయ్యాడు. ఆ డిపార్టుమెంటులో చేరిన కొద్ది రోజుల్లోనే స్టాఫ్‌కు సింహ స్వప్నం అయాడు. పై అధికారుల దృష్టిలో నిజాయితీ పరుడుగా పేరు తెచ్చుకున్నాడు.

ఇప్పు డతనికి ఎక్కడ 'బోను' పెడితే అవినీతి ఎలుకలు పడతాయో తెలుసు. ఎక్కడ 'వల' విసిరితే లంచగొండి తిమింగలాలు పడతాయో తెలుసు. అదీ కాకుండా ఎవ రెవరు ఏయే డిపార్టుమెంటులో ఎంతెంత సంపాదిస్తుంటారో తెలుసు. అందుకనే అత నంటే మంచి అభిప్రాయమున్న ఛీఫ్ విజిలెన్స్ ఆఫీసరు దినకర్ పాండే అతన్ని పిలిపించి సలహాలు తీసుకుం టుంటాడు. కాని, ఏకాంబరం ఈ మధ్య తన పంథాను మార్చు కున్నాడనే విషయం ఆయనకు తెలీదు. ఆయనకే కాదు, తనతో పని చేసే తోటి విజిలెన్స్ ఇన్స్పెక్టర్లకే ఆ విషయం తెలియకుండా చాలా జాగ్రతగా తన పథకాలు వేసుకుని అమలు జరుపుతున్నాడు ఏకాంబరం. అ దేమిటంటే ఈ దేశాన్ని మార్చటం తన వల్ల కాదు. తను అవినీతిపరులైన ఉద్యోగస్తులను వలలు విసిరి పట్టుకునే కొద్దీ తనకు శత్రువులు పెరుగుతారు. అందుకని అందరితో శత్రుత్వం తెచ్చుకునే బదులు కొద్దిగా 'పట్టు - విడుపు'గా ఉంటున్నాడు. స్వామి కార్యం స్వకార్యం చేసుకోవటం అలవాటు చేసుకుని నాలుగు రాళ్లు వెన కేసుకుంటున్నా డీ మధ్య. ఆయన బయలుదేరితే వెళ్లే దారిలో స్టేషన్ల నుంచి నెల మామూళ్లు, ఆయా ఊళ్లలో దొరికే వస్తువులు అన్నీ అతని సీటు (అంటే రైల్లో) దగ్గరకే వచ్చేట్లు ఏర్పాట్లు చేసుకున్నాడు.

ఇక పోతే, తన టార్గెట్ పూర్తి చేసుకోవటానికి టికెట్ చెకింగ్ డిపార్టుమెం టెలాగూ ఉందని అతనికి ధైర్యం. ఆ డిపార్టుమెంటు తన పాలిటి కల్ప వృక్షం. తన ప్రమోషనుకు అదే దిక్కు. ఎందు కంటే అక్కడ అవినీతి విశృంఖలంగా సాగుతుం టుంది. పైగా వారిని పట్టుకుని కేసులు బుక్‌చేస్తే ఒక్క రైల్వేలోనే కాదు, బయట ప్రజలు కూడా సంతోషిస్తారు. అందుకే అతను ఎక్కువగా ఆ డిపార్టుమెంటులోనే ఎలకల్ని పట్టుకుని కేసులు బుక్ చేస్తాడు. వేరే డిపార్టుమెంటుల జోలికి - అదే కేటరింగ్, ఇంజనీరింగు డిపార్టుమెంటుల జోలికి పోతే తనకు సమయానికి తిండి దొరకదు. పైగా పెద్ద పెద్ద నాయకుల సిఫారసులు వస్తాయి, పెద్ద పెద్ద అధికారుల కోపానికి గురి కావాల్సి వస్తుందని భయం. అక్కడ ఎంత అవినీతి ఉన్నా అది బయటి వారికి తెలీకుండా జరుగుతుంది. ఇదే ఉద్దేశ్యంతో ఏకాంబరం టీ సీ డిపార్టుమెంటులో వలలు విసిరి కేసులు బుక్ చేసి మంచి పేరు తెచ్చుకున్నాడు.

"ఏం సార్ ఏకాంబరం గారూ, ఏమన్నారు మన బాస్?" అని తన తోటి అధికారి విక్టర్ దాసు అడిగిన ప్రశ్నతో ఉలిక్కి పడి "ఆ ఏముందీ, టార్గెట్స్ పూర్తి చేయమంటారు" అన్నాడు ముక్తసరిగా .

"సార్, మీరు పార్టీ ఇవ్వాలి."

"ఏం, ఎందుకు?"

"మీరు ఛీఫ్ ఇన్స్పెక్టరుగా ప్రమోట్ అవుతున్నారని తెలిసిందిలే సార్."

"ఓ, అదా, టార్గెట్‌లు పూర్తి చేయాలిట."

"అదెంత సార్, మీరు తలచుకుంటే!"

"డెకాయ్ చెక్ కూడా చేయాలిట" అన్నాడు ఏకాంబరం.

"సార్, ఆ చెక్ అంటేనే నాకు చాలా అన్యాయంగా తోస్తుంది సార్" అన్నాడు విక్టర్ దాసు.

విక్టర్ దాసు ఇంజనీరింగు డిపార్టుమెంటులో పర్మనెంటు వే ఇన్స్పెక్టరుగా చేరి, అక్కడ జరిగే అవినీతి అక్రమాలకు తట్టుకోలేక, ఆ అవినీతిని సమూలంగా నాశనం చేద్దామనే ఉద్దేశ్యంతో విజిలెన్స్ డిపార్టుమెంటులో చేరి, పెద్ద తిమింగలాలను పట్టుకోవాలని ప్రయత్నించి, దెబ్బ తిని ఏకాంబరం పంథాలో నడవాలని ప్రయత్నిస్తున్న జూనియర్ విజిలెన్స్ ఇన్స్పెక్టరు.

'చూడండి విక్టర్ గారూ, ప్రతి డిపార్టు మెంటులో కొన్ని టెక్నిక్‌లు ఉంటాయి. కొన్ని పట్టు విడుపు లుంటాయి. మనకు కావాల్సింది కేసులు, టార్గెట్లు. అవి కావాలంటే కొంత మంది అవినీతి పరులైన రైల్వే అధికారులు కావాలి. టీసీలు రైల్వే అధికారులు కారు. మనం డెకాయ్ చెక్‌లో చేసేది ఏవిటీ? ఒక రైల్వే అధికారి ప్రయాణికుడుగా నటిస్తూ స్లీపర్ టీసీకి బెర్తు కోసం కొంత డబ్బు (నంబర్లు నోట్ చేసుకుని) ఇస్తాడు. మనం పక్క స్టేషన్లో వెళ్లి ఆ టీసీని సోదా చేసి మనం ఇచ్చిన నోట్లు స్వాధీనం చేసుకుని 'కేసు' బుక్ చేస్తాం, అంతే. ఇది అన్యాయం ఎలా అవుతుంది చెప్పండి!'

'మనమేగా డబ్బు లిచ్చి ప్రలోభ పెడుతోంది?'

"మిస్టర్ దాస్! మనం వల విసిరాం. చేపలన్నీ వలలో పడతాయా చెప్పు! 'ఎర'కు ఆశ పడే చేపలే పడతాయి. ఇదీ అంతే! ఓ కే, మనం 'డెకాయ్' చెక్ కండక్టు చేయాలి, తప్పదు కదా! మీరు మద్రాసు వైపు వెళ్లి అది పూర్తి చేసి మంచి కేసు బుక్ చేయండి" అన్నాడు ఏకాంబరం. ఏకాంబరం సీనియర్ కాబట్టి అతను తన జూనియర్స్‌కు ప్రోగ్రామ్స్ ప్లాన్సు ఇస్తుంటాడు.

'ఓకే సార్. ఓ రెండ్రోజుల్లో బయలుదేరతాను' అని సెలవు తీసుకున్నాడు విక్టర్ దాసు.

000

"ఏమండీ! మీకో శుభ వార్త చెప్పనా?" అన్నది ఏకాంబరం భార్య పంకజం అన్నం వడ్డిస్తూ.


"ఏవిటోయ్ అది?" ముద్ద నోట్లో పెట్టుకుంటూ.

"అమ్మాయి పెళ్లి కుదిరినట్లే" అంది.

"ఆ(!" అన్నాడు కొరబోయి నెత్తిపై కొట్టుకుంటూ ఆశ్చర్యంతో.

తన కూతురి పెళ్లి అంత తొందరగా కుదురుతుం దనుకోలేదు. ఎందు కంటే అతని ముగ్గురు కూతుళ్లలో పెద్దది సరోజ, అనాకారి.

**చిట్కా**



**మి**గిలిపోయిన సబ్బు ముక్కలను వేడి నీళ్లలో వేసి, జిడ్డోడుతున్న మసిగుడ్డలు, చేతులు తుడుచుకునే టవళ్లు వేసి 2 నుంచి 4 నిముషాలపాటు (జిడ్డును బట్టి) మరిగిస్తే, జిడ్డు మాయం.

పైగా నల్లగా మసి పూసినట్లుగా ఉంటుంది. మిగిలిన వారిద్దరి పెళ్ళిళ్ల గురించీ పెద్ద దిగులు లేదు ఏకాంబరానికి. వాళ్లిద్దరూ తల్లి పోలికతో తెల్లగా ఉంటారు. సరోజ ఒక్కతే అచ్చు తండ్రి పోలిక.

"అవునండీ. ఏమిటీ ఆలోచిస్తున్నారు? మీరు కేంపు కెళ్లిన పక్క రోజు మా పింతల్లి కొడుకు వెంకట్రావు వచ్చాడు. వాడు మనమ్మాయికి ఒక మాంఛి సంబంధం తెచ్చాడు. పిల్ల వాడిది మన తెనాలిట. పెళ్లి చూపులు కూడా ఏర్పాటు చేసి మరీ వచ్చాడు."

"ఆఁ, పెళ్లి చూపు లయ్యాయా?" అన్నాడు ఏకాంబరం భోజనం పూర్తి చేసి ఏకాంబరం కంచంలో చేయి కడుక్కుంటూ.

"వాడు రావటమే పిల్ల వాడితో వచ్చాడు. 'బావ రావటం ఆలస్యం అవుతుం దక్కయ్యా. మనం పిల్లను చూపిద్దాం' అన్నా డండి" అన్నది గిన్నెలు సర్దుతూ.

"చూపించేశావా? ఏవన్నాడు కుర్రాడు?" అన్నాడు తన కూతురు అందాన్ని తలుచుకుంటూ కుర్చీలో కూర్చుని.

"ఆఁ, ఏవంటాడు? నచ్చిందని అన్నాడు. కాని..."అన్నది కుర్చీ పై చేతులు పెట్టి.

"కానీ, ఏవిటోయ్ అది?"

"కట్నం కొంచెం ఎక్కువ అడిగాడు."

"ఇచ్చేద్దాం"అన్నాడు ఏకాంబరం తన భార్య కట్నం 'వల' విసిరినందుకు సంతోషిస్తూ.

"అందుకనే మన వెంకట్రావుకు కొంత పైకం 'కట్నం' అడ్వాన్సుగా ఇచ్చి పిల్ల వాడి తల్లిదండ్రుల కిచ్చి ఖాయం చేసుకు రమ్మన్నా" అన్నది పంకజం మురిసి పోతూ.

ఒక వైపు చీఫ్ ఇన్స్పెక్టరుగా ప్రమోషన్, మరో వైపు ఎంతో కష్ట మనుకున్న కూతురి పెళ్లి కుదరడంతో, ఏకాంబరం ఉక్కిరిబిక్కిరి అయ్యాడు.

"అవునూ, పిల్ల వాడేం చేస్తున్నా డన్నావ్?" అనడిగాడు నింపాదిగా.

"రైల్వేలో టీసీ ఉద్యోగం" అన్నది.

ఒక్క సారి తుళ్లిపడ్డాడు ఏకాంబరం. "టీసీయా?"

"అవును. తెనాలి జంక్షన్‌లో టీసీగా చేస్తున్నాట్ట. ఏం టీసీ పనికి రాడా మీ అల్లుడుగా?"

"అబ్బే, ఏం లేదోయ్. ఆ ఉద్యోగంలో అంత సుఖం ఉండదు" అన్నాడు.

"ఏవిటండీ సుఖం? మంచి జీతం. కుటుంబానికి పాసులు, బోనసు, కొద్దో గొప్పో పై సంపాదన" అన్నది పంకజం చేజిక్కిన మంచి సంబంధం ఎక్కడ జారిపోతుందో అని.

"అదుగో, ఆ పై సంపాదన గురించే నేననేది! మాకు సులభంగా దొరికేది వాళ్లేనే. ఈ సంబంధం వద్దోయ్!"అన్నాడు కీడును శంకిస్తూ ఏకాంబరం.


'ఆఁ, మీదంతా చోద్యం! అమ్మ పెట్టదూ, అడుక్కు తిన్నివ్వదన్నట్లు, మీరు వెళితే పది రోజుల గ్గాని రారు, దొరక్క దొరక్క ఒక సంబంధం కుదిరితే ... అయినా మా పెద నాన్న అల్లుడు శివరాం టీసీగా పాతికేళ్ల బట్టి చేస్తున్నాడు, పట్టుబడ్డాడా ఏమిటీ? బ్రహ్మండమైన ఇల్లు కట్టించాడు. ఒక వేళ అలా జరిగితే మీరు లేరా?' అన్నది భరోసాగా పంకజం.

ఇక ఏకాంబరానికి మాట్లాడ్డాని కేం తోచ లేదు. అయినా కుర్రాడు తెనాలి జంక్షన్‌లో టీసీ కదా. రైల్లో కాదు కదా. తను చెక్ చేసేది రైల్లో టీసీలను కదా - అనుకుని, "సరేలే" అని పంకజానికి గ్రీన్ సిగ్న లిచ్చాడు.

"కాబోయే అల్లుడిని మీరు చూడరా?"

"ఆఁ, చూస్తాను. ఈ వారంలో కొద్దిగా పనులున్నాయి. అవి పూర్తి చేసుకుని చూస్తాను" అన్నాడు విశ్రాంతి కుపక్రమిస్తూ.

000




"ఆఁ, ఏవండీ! విక్టర్ గారూ, చెక్స్ అన్నీ సక్రమంగా అయాయా?" అనడిగాడు ఏకాంబరం హెడ్ క్వార్టర్సు చేరగానే.

"ఆ టార్గెట్స్ అయిపోయినట్లేనండి. డెకాయ్ చెక్ కూడా చేశాం" అన్నాడు విక్టర్ వినయంగా.

"వెరీ గుడ్. మన ఛీఫ్‌కు రిపోర్టులు సబ్మిట్ చేద్దాం" అన్నాడు రాబోయే ప్రమోషన్ ఊహించుకుంటూ.

"కానీ సార్, డెకాయ్ చెక్‌లో ఒక అమాయకుడైన రమేష్ అనే టీసీ పట్టుబడ్డాడు. అతను అసలు ఎక్స్‌ట్రా డబ్బులు వద్దని అన్నా వినక మన వాళ్లు అతని కోటు జేబులో డబ్బులు బలవంతంగా పెట్టారని ఒకటే గోల సార్!" అన్నాడు విక్టర్ దాసు బాధగా.

"మిస్టర్ విక్టర్! ఆపరేషన్ చేసే డాక్టరు పేషంటుకు బాధ అని ఆపరేషన్ మానేస్తాడా? అలానే పట్టుబడ్డ ప్రతి ఒక్కడూ తాను అమాయకుడిని అని మన ముందు ఏడుస్తాడు. మనం ఫీలవ కూడదు. డోంట్ వర్రీ!" అని ఛీఫ్ ఆఫీసరు వద్దకు ఫైళ్లు పట్టుకుని బయల్దేరాడు ఏకాంబరం.

000

ఇంటికి హుసారుగా చేరిన ఏకాంబరానికి పంకజం మొహం చూడగానే ఏదో జరిగిందని అనుమానం కలిగింది. అయినా పని ఒత్తిడి వల్ల అలా ఉందనుకుని, 'పంకజం, నీకో హ్యాపీ న్యూస్!' అని తన ప్రమోషను సంగతి చెప్పబోయాడు.

'ఏం హ్యాపీ న్యూసో, మన కొక బాడ్ న్యూస్' అంది విచారంగా.

"ఏవిటోయ్ అది?"

"ఆ తెనాలి టీసీ సంబంధం వారు మనమ్మాయిని చేసుకోమని కబురు చేశారు."

"ఎందుకనీ? కట్నం చాలలేదా?"

"అదేం కాదు. మన సంబంధం అసలు అతనికి అచ్చి రాలేదట! ఎవరో టీసీ సెలవు పెడితే ఇతన్ని రైల్లో పని చేయమని ఆర్డర్సు ఇచ్చారుట. డ్యూటీ చేస్తున్నపుడు ఎవరో డబ్బు లిచ్చి పట్టించారట. అయినా మాయదారి వెధవలు, అమాయకుడైన అతనికి డబ్బు లిచ్చి పట్టుకోవడం ఏమిటీ?" అన్నది పంకజం.

"అతని పేరేమి టన్నావ్?"అడిగాడు ఏకాంబరం అనుమానంగా.

"రమేష్" అన్నది నిర్లిప్తంగా.

"ఆ!" అన్నాడు ఏకాంబరం విక్టర్ దాసు పట్టుకున్న రమేష్ పేరు గుర్తు తెచ్చుకుంటూ, తన భార్య ఎడ్వాన్సుగా 'ఎర'గా ఇచ్చిన కట్నం డబ్బులు ఎలా వసూలు చేయాలా అనే ఆలోచనతో తల పట్టుకుని.